# శివానందం

మా తాతగారు జమీందారు. ఆయన ఇప్పుడు లేరు ఆయన తాలూకు ఎస్టేటుకూడా ఇప్పుడు లేదు. అది ఎప్పుడో గవర్నమెంట్ తీసేసుకున్నారు. ప్రస్తుతం ఉన్నదల్లా ఈ పల్లెటూళ్ళో ఈ పెద్ద ఇల్లు ఎందుకో ఈ ఇల్లు అమ్మాలన్న ఆలోచన ఎవరికీ రాలేదు ఎవరూ దీని విషయం ఇంతవరకూ పట్టించుకోలేదు. అయినా ఇంత చిన్న ఊళ్ళో ఇంత పెద్ద ఇల్లు ఎవరూ కొనరేమో.

నాకు మా అమ్మమ్మను చూసిన గుర్తులేదు. ఆవిడ ఎప్పుడో నా చిన్నతనంలోనే పోయారు కాబోలు! మా తాతగారు మాత్రం బాగానే గుర్తు ఉన్నారు. ఆయన ఉండగా అందరమూ అప్పుడప్పుడు ఈ ఇంటికి వస్తూ వుండే వాళ్ళం, ముఖ్యంగా పండగలప్పుడు అప్పుడే మేము బంధువులమంతా ఒకరినొకరు చూసుకోవటము, కలుసుకోవటము.

నాకు ఇద్దరు మేనమామలు, ఇద్దరు పినతల్లులు ఉన్నారు. వాళ్ళూ వాళ్ళపిల్లలు అంతా తలా ఒకచోట ఉన్నారు. ఏవో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ! కొందరు అసలు ఈ దేశంలోనే లేరు. విదేశాలలోనే స్థిరపడ్డారు. అందుచేత ఈ ఇంటిమీద ఎవరికీ శ్రద్ధలేదు, ఆసక్తి లేదు.

మా తాతగారు మాత్రం ఉన్న ఊరు పదలకుండా ఒక్కరూ చివరిదాకా ఇక్కడే ఉన్నారు. ఒంటరిగా, ఏదో కొందరు పనివాళ్ళను తెలిసినవాళ్ళను ఆసరాగా చూసుకుని.

చెప్పానుగా, ఆయన ఉన్నప్పుడు అందరమూ అప్పుడప్పుడూ వస్తూ ఉండేవాళ్ళమనీ. కాని ఇప్పుడు ఆయన లేరు. ఆయనపోయి అప్పుడే పదేళ్ళపైన అవుతోంది. అందుచేత ఈ మధ్య ఇక్కడికి ఎప్పుడూ రాలేదు. మా బంధువులంతా ఎవరెక్కడ ఉన్నారోకూడా సరిగా వివరాలు తెలియవు. ఎప్పుడైనా ఏదో ఒక కబురు అందుతూ ఉంటుంది. అంతే!

మేము మాత్రం చాలా కాలంగా బొంబాయిలోనే స్థిరపడి ఉన్నాము. ఒక చిన్న ఫ్లాట్ కొనుక్కొని అదే సొంత ఇల్లని సంతోషపడుతున్నాము. పిచ్చిక గూడులా ఉన్న ఆ ఇల్లే మాకు స్వర్గంలా ఉన్నది. మాకున్న సంతానం ఒక్క పిల్లవాడు మాత్రమే. వాడు ఎప్పుడో పై చదువులకని అమెరికా వెళ్ళి అక్కడే ఉండిపోయాడు. మళ్ళీ వచ్చే ఉద్దేశం ఇంతవరకూ లేదు. కాకపోతే అప్పుడప్పుడు మమ్మల్నే రమ్మని రాస్తూ ఉంటాడు. మాకూ వెళ్ళే ఉద్దేశ్యం ఇంతవరకూ రాలేదు.

ఇప్పుడు పరిస్థితులు కొంచెం మారాయి. ఆయన రిటైర్ అయ్యారు. ఏమీ తోచక ఆయనకి ఓసారి అమెరికా వెళ్ళి అబ్బాయి దగ్గర కొన్నాళ్ళు ఉండిరావాలనిపించింది. ఎందుకో నాకు వెళ్ళాలనిపించలేదు. ఒంటరిగా బొంబాయిలోనే ఉండడానికి మనస్కరించలేదు. అప్పుడు గుర్తువచ్చింది. అకస్మాత్తుగా ఈ పల్లెటూరు, ఇక్కడి తాతగారి ఇల్లు

చిన్నప్పుడు ఈ పెద్ద ఇంట్లో ఇంటిచుట్టూ ఉన్న పెద్ద తోటలో తిరుగుతూవుంటే నాకెంతో బాగుండేది. కాస్సేపు మనస్సు నిర్మలంగా, ప్రశాంతంగా ఉండేది అకస్మాత్తుగా నాకు మళ్ళీ ఇక్కడ కొన్నాళ్ళు ఒంటరిగా ప్రశాంతంగా ఉంటే బాగుండుననిపించింది.

ఇక్కడ చెంగయ్య అని ఒక పనివాడు సకుటుంబంగా ఇల్లు చూసుకుంటున్నాడు. వాడు మా తాతగారి దగ్గర పని చేసినవాడే. అప్పటి

నుంచి ఉన్నాడు. వాడికి రాశాను, నేనువచ్చి ఇక్కడ కొన్నాళ్లు ఉంటానని. ఆయన అమెరికా వెళ్ళిన మరునాడు, నేను ఇక్కడికి వచ్చాను.

ఇంటిలో పెద్ద మార్పేమీలేదు. అంతా అలానే ఉంది. గదులు కొన్ని తెరిచివున్నాయి. కొన్ని మూసి తాళం వేసి ఉన్నాయి. వచ్చాక అన్నీతెరిపించి శుభ్రం చేసే పని పెట్టుకున్నాను. ఇది తీరికలేని పని. తుడుస్తూవుంటే దుమ్ము వస్తూనే ఉంటుంది. అసే పదేళ్ళగా స్థిరనివాసం ఏర్పరచుకున్న దుమ్ము బలంగానే ఉంది.

చెంగయ్య వెనకవేపు ఉన్న గదుల్లో ఉంటున్నాడు. వాడి కుటుంబం లోనూ ఎక్కువ ఎవరూలేరు. భార్య, ఇద్దరు మనుమరాళ్ళు మాత్రం ఉన్నారు. శీల, పద్మ, వాడి కొడుకు తక్కిన పిల్లలు ఇంకెక్కడో ఉన్నట్లున్నారు. వేరే ఊళ్ళో!

చెంగయ్య భార్యకు కొంచెం వయసు దాటింది. ఎక్కువ పనిచేసే ఓపికలేదు. శీల, పద్మ చిన్నపిల్లలు, వాళ్ళకి ఇంకా పనికి, ఆటకి అంతగా వ్యత్యాసం తెలియదు. పని చేస్తూచేస్తూ ఆడుకుంటూ ఉంటారు. చెంగయ్య కాస్త ఓపికగానే ఉన్నాడు. చెప్పినపని శ్రద్ధగా విని చేస్తూనే వున్నాడు.

చుట్టూ ఉన్న తోట అంతా అడివిలా వుంది. ఏ ఆలనాపాలనా అక్కరలేని మహావృక్షాలన్నీ అలానే ఉన్నాయి కావలసినంత గాలి, చల్లదనాన్ని ఇస్తూ! క్రిందంతా రాలిన ఆకులు అలానే ఉన్నాయి ఎండకు ఎండుతూ. వానకు తడుస్తూ కుప్పలుకుప్పలుగా! ఈ తోటంతా ఊడ్చి బాగు చెయ్యటం ఎవరికీ సాధ్యంకాదేమోననిపిస్తోంది.

చెంగయ్య చేత రోజుకోగది ఊడ్పించి బాగుచేయిస్తున్నాను. అంత కన్న ఎక్కువ చెయ్యటం వాడికి సాధ్యంకాదు. నాకూ సాధ్యంకాదు. అన్ని గదుల్లో అక్కడక్కడ కొద్దిగా పగుళ్లు కనిపిస్తున్నాయి. అంతకన్న

ముఖ్యంగా ఒక్క గదిలోనూ సరిగా లైట్లు వెలగడంలేదు. కొన్ని చోట్ల స్విచ్ లేదు. కొన్ని చోట్ల వైర్లు వ్రేళ్ళాడుతూ కనిపిస్తున్నాయి. మెయిన్ స్విచ్‌బోర్డులో ఒక తేనెతుట్టె సురక్షితంగా ఉంది.

ఈ పరిస్థితుల్లో ముందు ఈ ఇంట్లో కరెంటు కొంత బాగుచేయించు కుంటేగాని ఉండడం సాధ్యంకాదని తోచింది. ఈ పల్లెటూళ్ళో కరెంటు బాగుచెయ్యటానికి ఎవరు దొరుకుతారు అని ఆలోచిస్తున్నాను. చెంగయ్యను అడిగాను, అతనికి చప్పున ఎవరూ తోచలేదు.

ఒకరోజు ముందరవేపు వరండాలో కూర్చుని ఉన్నాను. చెంగయ్య కూడా ఓ మూల కూర్చున్నాడు ఏవో కబుర్లు చెబుతూ! ముందరవేపు చెట్లన్నీ ఎక్కువగా ఉన్నాయి. వాటిల్లో కాకిగూళ్లు, కాకుల రొద కూడా ఎక్కువగానే ఉంది కొంచెం దూరాన ఉన్న గేటు దగ్గర ఎవరో మనిషి కనిపించాడు. పొట్టిగా, సన్నగా ఉన్నాడు. చేతిలో ఏదో సంచి ఉంది. ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

చెంగయ్య ముఖం ఒక్కసారి మతాబులా వెలిగింది. వెదకబోయిన తీగ కాళ్ళకు తగిలినట్లు మహదానందంతో అన్నాడు. "అడుగోనండి, అతనే శివానందం. అతను కరెంటు పని చేస్తాడండి" అని ఏదో నిర్లిప్తంగా నిశ్శబ్దంగా ఉన్న నా మనస్సుకు, కాకుల రొదకు, అవతలగా ఉన్న శివానందానికి లంకె కుదరలేదు. ఎవరూ ఏమిటీ అన్నట్లు తెల్లబోయి చూశాను కాస్సేపు అప్పుడు చెప్పాడు చెంగయ్య వివరంగా. "అతను శివానందం అండీ! టౌనులో కరెంటుపని చేస్తూ వుంటాడు. అత్తవారిల్లు ఈ ఊరే! అప్పుడప్పుడూ వస్తూ ఉంటాడు. పిలవనా అండీ? మన లైట్లు బాగు చేస్తాడేమో?"

అప్పుడు అర్థమైంది అతను ఒక ఎలక్ట్రీషియన్ అని. "పిలూ, అడిగి చూద్దాము" అన్నాను. వెంటనే చెంగయ్య పరుగెత్తుకువెళ్ళి

శివానందంతోసహా తిరిగివచ్చాడు. అతను బ్రహ్మానందంతో తుళ్ళిపోతున్నాడు మహానగరం కాకపోయినా ఈ ఊళ్లో కూడా తన్ను గుర్తించి, గౌరవించి, సత్కరించేవాళ్ళున్నారని తెలిసి అతనికి పరమానందంగా వుంది. అసలు మనిషిలో ఒక మార్పు వచ్చింది. నడకలో ఒక ఠీవి వచ్చింది దగ్గరగా వచ్చి నాకేసి ప్రశ్నార్థకంగా చూశాడు. నేను వివరాలు చెప్పాను. చెంగయ్యతో లోపలికివెళ్ళి గదులన్నీ చూసివచ్చాడు. బహుశా ఈపల్లెటూళ్లో కూడా తనకి కాలక్షేపానికి పని దొరికిందని సంతోషమేమో! "చేస్తానండి. ఇప్పుడు రెండు మూడు రోజులు నాకు సెలవే! ఇక్కడే ఉంటాను. రేపు టౌనుకు వెళ్ళి కావలసిన సామాన్లు తెచ్చి, ఎల్లుండి పని పూర్తిచేస్తాను" అన్నాడు. ఇప్పటికి ఇది కుదిరింది. కాని ఈ పైర్లు అన్నీ బాగుచెయ్యటానికి ఎంత ఖర్చు అవుతుందో తెలియదు. అయినా తప్పదు. అమెరికా వెళ్ళిన ఆయన ఎప్పుడు వస్తారో తెలీదు. అంచేత నాకిక్కడ కొన్నాళ్ళు ఉండక తప్పదు.

శివానందం మళ్ళా లోపలికివెళ్ళి అన్నీ చూసుకుని వచ్చాడు. ఆలోచిస్తూ అన్నాడు. "ప్రస్తుతం రెండు వందలు ఇప్పించండి. పని పూర్తి అయ్యాక మళ్ళా లెక్క వివరంగా చెబుతాను" అన్నాడు. మాట్లాడకుండా లోపలికివెళ్ళి తెచ్చి డబ్బు ఇచ్చి పంపాను. శివానందం సంతోషంగా వెళ్ళిపోయాడు. చెంగయ్య ఇంటికి పోయాడు.

ఒక్కదాన్నీ వాకిట్లో కూర్చున్నాను. ప్రశాంతంగా వున్న చెట్లు' చల్లగావున్న వాతావరణం మనసుకు ఆహ్లాదకరంగా వుంది. బొంబాయికి, ఈ ఊరికి ఎంత తేడా! ఇక్కడ ఎవరికీ ఏమీ పనిలేదు. తొందరలేదు. అంతా తీరికే! ఊరికే ప్రొద్దుపోకతప్ప గడియారం చూడాలిసిన పనికూడా లేదు. రోడ్ల మీద రణగొణధ్వని లేదు. అసలు రోడ్లేలేవు. ఏవో చిన్నచిన్న సందులు గొందులు తప్ప. పాతికేళ్ళ పరుగుల తరువాత కాలం వెనక్కి

వెళ్ళినట్లుంది నవ్వుతూ లేచి లోపలికి వెళ్ళాను, నిద్ర పోదామని. అంతకన్నా ఇక్కడ కాలక్షేపం లేదు. ఎప్పుడైనా శీల, పద్మ, వాళ్ళఅవ్వ వచ్చి కూర్చుంటారు, కాలక్షేపానికి. పిల్లలు ఆడుకుంటారు. ఆవిడ నేనూ ఏదో కాస్సేపు మాట్లాడుకుంటాము. ఏదో ఒక విషయం దొరక్కపోదు కాస్సేపు కాలక్షేపానికి. పాపం ఆవిడ మంచిదే! వంటపని, ఇంటిపని అంతా ఆవిడే చేస్తోంది, నాకు ఏమీ శ్రమ లేకుండా!

శివానందం మాట తప్పలేదు. అన్నప్రకారం మూడోరోజు వచ్చి సాయంత్రం లోపల పని అంతా పూర్తిచేశాడు అవేళ సాయంత్రం ఇంట్లో మొదటిసారిగా అన్ని దీపాలూ వెలిగాయి. ఇల్లు కళకళలాడింది. పిల్లలు సంతోషపడ్డారు. నాకూ చీకటి తొలగి బాగుంది. దీపాల కాంతిలో శివానందం ఏదో లెక్క రాసి కాగితం చేతికిచ్చాడు. కాగితంగా వివరంగా ఉంది. కాని నాకు ఒక్క ముక్క అర్థంకాలేదు. నేను కాన్వెంటులో చదువుకున్నాను గాని కరెంటు పని నేర్చుకోలేదుగదా! నాకు అర్థమైంది ఒక్కటే! మొత్తం బిల్లు 485 రూపాయలు అయిందని ఇంత డబ్బేమిటి అనుకున్నాను. అయినా ఇవ్వవలసిన డబ్బు ఇచ్చి పంపాను.

అప్పటినుంచి శివానందం తరుచు వస్తూనే ఉన్నాడు. వచ్చినప్పుడల్లా సంతోషంగా ఆపద్బాంధవుడిలాగా నాతో అంటూ ఉంటాడు. "అమ్మగారూ, మీరు ఈ ఇంట్లో దేనికీ ఇబ్బంది పడకండి. ఏ పనైనాసరే, నాతో చెప్పండి, నేను చేసిపెడతాను. నేను నాలుగైదు రోజులకొకసారి ఇక్కడికి వస్తూనే ఉంటానండి. మీ కెందుకు శ్రమ. నేను ఉన్నాను గదా!" ఇదీ ధోరణి. అయితే నాకు మళ్ళీ ఏ అవసరమూ కలగలేదు. అలా ఓ నెలా రెండు నెలలు గడిచిపోయిన్నాయి. ఎందుకో నాకు శివానందం మీద మంచి అభిప్రాయం కలగలేదు. ఒట్టి డబ్బుమనిషి, డబ్బుకోసం తాపత్రయపడతాడు అనిపించేది అందుచేత అతనంటే ఒకరకమైన చులకన భావం ఏర్పడింది. నేను మళ్ళా పిలవకపోయేసరికి అతనూ క్రమంగా రావడం తగ్గించాడు.

ఒకరోజు మధ్యాహ్నం మామూలుగా వరండాలో కూర్చుని ఉన్నాను. పిల్లలు వెనకవేపు ఆడుకుంటున్నారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా విపరీతంగా కాకుల రొద వినిపించింది. పిల్లలు 'అయ్యో అయ్యో' అని కేకలు పెడుతున్నారు చెంగయ్య వాడి భార్య కూడా ఏదో అరుస్తూనే ఉన్నారు. నాకు భయంవేసింది. ఏమైంది? అర్థంకాలేదు. ఆదుర్దాగా చదువుతున్న పుస్తకం జారవిడిచి లోపలికి పరుగెత్తాను.

ఒక చిన్న కోకిలపిల్ల నేలమీదపడి గిలగిలా తన్నుకుంటోంది. కాకులన్నీ గుంపుగా చేరి దాన్ని ముక్కుతో పొడవడానికి ప్రయత్నిస్తున్నాయి. అది తప్పించుకోలేక తన్నుకుంటోంది. పిల్లలు బాధపడుతూ ఏడుస్తున్నారు. చెంగయ్య అతని భార్య ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా చూస్తున్నారు. ఎవరు దగ్గరికి వెళ్ళినా కాకులన్నీ కలిసిపొడవడానికి వస్తున్నాయి. నాకూ చాలా బాధగా ఉంది. ఏం చెయ్యాలో తోచలేదు, కోకిల పరాభృతము అనీ, కాకి గూటిలో పెరుగుతుందనీ చిన్నప్పుడే చాలా కావ్యాలలో చదువుకున్నాను. కాని ఇల్లాంటి భయంకరమైన దృశ్యం ఇంతవరకు ఎప్పుడూ చూడలేదు. ఆరో అంతస్థులో అద్దాల కిటికీలతో ఉన్న బొంబే ఫ్లాట్‌లోకి కాకులు రావు గదా?

ఏంచెయ్యాలో తెలియక అందరమూ బాధపడుతూ అయోమయమైన స్థితిలో ఉన్న ఆ క్షణంలో వచ్చాడు ఎందుకో శివానందం. వస్తూనే జరుగుతున్న దృశ్యంచూసి అర నిమిషమైనా ఆలోచించకుండా హడావిడిగా చేతిలో ఉన్న సంచీ, కాళ్ళజోడూ అన్నీ అరుగుమీద పారేసి అమాంతం కాకులమీద పడ్డాడు. అవి పొడుస్తున్నా లెక్క చెయ్యకుండా చేతులు విసురుతూ, వాటిని తరుముతూ.

కొంచెం సేపటికి కాకులన్నీ చెల్లాచెదురైనాయి. దూరంగా చెట్ల కొమ్మలలోనుంచి చూస్తున్నాయి. కోకిల పిల్ల కొనఊపిరితో నీరసంగా నేల

మీద పడి ఉంది. దాన్ని లేవదియ్యటానికి శివానందం దగ్గరగా వెళ్ళాడు. అది భయపడి అమాంతం లేచి ఎగిరి పక్క తోటలోకి వెళ్ళిపోయింది వెంటనే చెట్లకొమ్మల్లో ఉన్న కావులన్నీ కావుకావుమని అరుచుకుంటూ దాన్ని తరుముకుని గుంపుగా పక్క తోటలోకి పోయాయి. అంతే! వెంటనే ఒక్క ఉదుటులో గోడ దూకి వాటిని తరుముకుంటూ శివానందం పక్క తోటలోకి పరుగెత్తాడు. ముందు కోకిల, దాన్ని తరుముతూ చుట్టూ కాకులు, వాటిని తరుముతూ శివానందం తోటంతా పరుగెత్తుతున్నారు ఈ హడావిడికి పక్కింటావిడ బయటికి వచ్చింది. తలుపుదగ్గరగా నిలబడి చూస్తోంది. ఆవిడ కాస్త స్థూలకాయురాలు. మా గోడదగ్గర నిలబడి మేమంతా ఏమౌతుందోనని అచ్చర్దాగా చూస్తున్నాము కాస్సేపటికి గత్యంతరంలేనట్లు కోకిల శివానందం చేతుల్లోకి వచ్చి చిక్కుకుంది అంతే! అతను ఒక చేత్తో దాన్ని చొక్కా లోపల దాచుకుని, రెండో చెయ్యి కాకులు పొడవకుండా తలకు అడ్డం పెట్టుకుని గబగబా పక్కింట్లోకి పరుగెత్తాడు కాస్సేపు కాకులన్నీ అక్కడే తారట్లాడాయి తరువాత వాటి దోవన అవి పోయాయి. మేమంతా కూడా లోపలికి వెళ్ళిపోయాము.

అంతా సద్దుమణిగిన తరువాత శివానందం వచ్చాడు. ఒక్క బుట్టలో కోకిలను భద్రంగా దాచి, "అమ్మగారూ, చీకటి పడేదాకా దీన్ని ఎలాగైనా దాచి ఉంచాలండీ! ఆ తరువాత వదిలెయ్యవచ్చును. పాపం చాలా భయపడిపోయింది. పక్కింట్లో కాసిని నీళ్ళు పట్టాను" అన్నాడు. పాపం ఆ కోకిల ఊపిరి లేనట్లు బుట్టలో పడి ఉంది. "ఫరవాలేదులే! చెంగయ్య చూసుకుంటాడు" అన్నాను. చెంగయ్య కూడా వచ్చాడు. "నేను జాగ్రత్తగా చూసుకుని వదులుతానులే బాబూ!" అన్నాడు. అంతటితో ఆ ఘట్టం ముగిసింది.

శివానందం ముఖంలో ఏదో ఒక మధురమైన కాంతి, ఆనందం,

తాండవిస్తున్నాయి. ఇది ఇతను మొదటిరోజున నన్ను చూడడానికి వచ్చి నప్పుడు కనిపించిన ఆనందంలాంటిది కాదు. ఆవేళ అతని ముఖంలో నాకు కనిపించినది, అమ్మగారు నన్ను పిలిచారు అన్న గర్వం. ఇక్కడ ఏదైనా పని దొరకచ్చు, డబ్బు సంపాదించుకోవచ్చు అన్న ఆశతో కూడిన సంకుచిత మైన ఆనందం. ఇవ్వాళ కనిపిస్తున్నది—

"నేనూ ఒక మంచిపని చెయ్యగలిగాను, ఒక జీవిని కాపాడ గలిగాను" అన్న ఆత్మసంతృప్తితో కూడిన ఆనందం. రెండింటికీ ఎంత తేడా! అతని కళ్లు మిలమిలా మెరుస్తున్నాయి. నోట మాట రానట్లు కాస్సేపు అలాగే నిలబడిపోయాడు. తరువాత మెల్లగా వెళ్ళిపోయాడు.

మానవ నైజం విచిత్రమైనది. అందరూ మంచివాళ్ళు కారు, అందరూ చెడ్డవాళ్ళు కారు. పరిస్థితినిబట్టి స్వభావం మారుతూ వుంటుంది కాబోలు.

ఆ రోజు నుంచి నాకు శివానందం మీద ఏర్పడ్డ దురభిప్రాయం మారిపోయింది. ఇప్పుడు అందరిమీదా సదభిప్రాయమే కలుగుతోంది.